# ఆత్మీయుడు

సీను ఏం చేస్తున్నాడా అని చూశాడు నరసయ్య. సీను రాముడి నోటికి వెరుసెనగ పిండి ముక్కలు అందిస్తున్నాడు. అది తాపీగా తింటూవుంది. 'ఈ లెక్కన మేపితే రాముడు చాల త్వరగా బలిసిపోతుంది. మరీ ఎక్కువైతే పాగరెక్కి, మనుష్యుల మీదికే తిరగబడుతుంది. రేపది చిన్న పిల్లల్ని కుమ్మి క్రింద పడదోసినా ఆశ్చర్యపడ నవసరం లేద'నుకొన్నాడు నరసయ్య.

పొట్టేళ్ళను పెంచడం నరసయ్యకుకూడా చాల సరదా అయిన పనే. కాని వాటిని చేతులారా పెంచి పెద్దజేసి, ఏ పండుగనాడో చేతులారా ప్రాణం తీయాలంటే మటుకు ఆయనకు మనసు నొప్పుకోదు. చిన్నప్పుడు కొత్తగా వ్యవసాయంలో ప్రవేశించినప్పుడు చాల పొట్టేళ్ళను పెంచాడు. అవన్నీకూడా తన కళ్ళముందరే నరకబడినయ్. వాటి మాంసం తనే తినవలసి వచ్చింది. ఒకసారి ఒక పొట్టేలుపిల్లను తను ఎంతో ఇష్టంతో గారాబంగా పెంచుకొన్నాడు. అలాంటిదాన్ని ఒక పండుగనాడు తండ్రి కోసేయాలంటే తను వొప్పుకోలేదు. దానిమీదట తనకూ తండ్రికీ మధ్య చిన్న ఘర్షణకూడా జరిగింది. ఆఖరుకు దాన్ని ఇంట్లో కోయలేక బయటివారికి అమ్మివేయడం జరిగింది. అది పోయినతర్వాత కుటుంబంలో ఒక మనిషి పోయినంత వెలితి కనిపించింది

తనకు. చాల రోజులవరకు ఏమీ తోచకుండా పోయి మతి చెడింది. ఇక చస్తే, ఇలాంటి వాటిని పెంచకూడదని నాడు నిర్ణయించుకొన్నాడు.

ఈ పొట్టేలును చూస్తుంటే, తను చిన్నప్పుడు పెంచుకొన్న పొట్టేలు పిల్ల అదేపనిగా జ్ఞాపకం వస్తూవుంది. దాని కొమ్ములూ ఇలాగే ఇంతే వుండేవి. అదీ ఇలాగే మెడ పైకెత్తి గంభీరంగా చూసేది. మనిషి కనిపించగానే కన్న బిడ్డలాగా దగ్గరగా వచ్చి నిల్చుని ఎంతో గంభీరంగా కళ్ళింత చేసుకొని చూసేది. ఇదీ సీను దగ్గర అలాగే అలవాటు పడుతోంది. ఇదీ సీనుకు ప్రాణ స్నేహితుడుగా మసులుతోంది. సీను రాముణ్ణి ఎంతో శ్రద్ధగా పెంచుకొంటున్నాడు. తన భోజనం కన్న, దాని మేత విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకొంటున్నాడు. గానుగపిండీ, రాగిపిండి తిని బాగా క్రొవ్వెక్కింది. పైగా దానికి తరచు స్నానం చేయిస్తూ వున్నాడు. అంచేత అది నిగనిగ లాడుతూవుంది. దగ్గరకొస్తే బిడ్డ వచ్చినట్లుగానే వుంటుంది. కాని...ఆఖరుకు...ఒక నాడు......సీను కూడా తనలాగే బాధ ననుభవించాల్సి వస్తుంది.

"ఇక చాలు" నన్నట్లు తృప్తిగా మెడ విదలించింది రాముడు. సీను చిన్న పాత్రలో నీళ్ళు పెచ్చిపెట్టాడు. అది కొద్దిగా త్రాగి, గంభీరంగా మెడ పైకెత్తి వూరుకొంది.

సీనుకు పొలం పనులు, ఇలాంటివి చాల యిష్టం. వాడికి చదువు అట్టే వంటబట్టటం లేదు. పొట్టేలు పిల్లమీద వున్న శ్రద్ధ, చదువుమీద లేనప్పుడు ఆ చదువు ఎలా

వస్తుంది? సీను బాగా చదువుకొని మంచి పెద్ద ఆఫీసర్ కావాలని తన కోరిక. చూడగా చూడగా సీను తన కోరికను తీర్చేలా లేడని పిస్తోంది. సీనుకన్న చిన్నవాడు చిట్టిబాబుకు చదువు అబ్బేటట్లు కనిపిస్తుంది. కాని వాడు పెద్దవాడవుట మెప్పుడు? తన కోరిక తీర్చటమెప్పుడు? ఈ పెద్దవాడు గాని కొంచెం శ్రద్ధతో చదువుకొని పైకి వచ్చాడంటే...అందువల్ల కొంచెం వుందలిస్తూ వుండాలి...... అనుకొంటూ—

"ఒరేయ్ సీనూ...ఇంక చాలుగానీ, పోయి చదువుకో" అన్నాడు సీనుతో తండ్రి.

"ఎంతసేపూ చదువేనా నాన్నా" అని సీను రాముడి వీపు నిమురుతూ వుండిపోయాడు.

♦ ♦ ♦

చిట్టిబాబుకు రాముడికీ మంచి స్నేహం కుదిరింది. చిట్టిబాబు దానిమీద కూర్చున్నాసరే అది ఏమీ అనదు. ఇప్పుడు చిట్టిబాబు చాల హుషారుగా వుంటున్నాడు. రామునితో అమిత సరదాగా గడుపుతున్నాడు.

రాముడు బాగా బలిసింది. బాగా కండ పట్టి పోతరించింది. కొమ్ములు తిరిగాయి. దానికి ఎప్పుడైనా కోపం వచ్చి, మెడ పైకెత్తి తీవ్రంగా చూసిందీ అంటే తాటిమానంత మగవాడైనాసరే, అల్లంతదూరాన అలా నిల్చుండిపోవలసిందే! అది పొలాల దగ్గర్నుంచి ఇంటికి వస్తున్నప్పుడు దారిలో చూడాలి. తోటి పొట్టేళ్ళతో తగలబడిందీ అంటే

గొప్ప యుద్ధంలా వుంటుంది. దాన్ని చూడగానే నాటుగకం పొట్టేళ్ళన్నీ ఆమడదూరం పారిపోసాగాయి. ఏదైనా సాహసించి, పోట్లాడింది అంటే దాని తల బొప్పి కట్టిందన్నమాటే. ఎవరైనా అడ్డుకోకపోతే తల పగిలినా ఆశ్చర్యంలేదు. రాముడు దేనితోనైనా తగుల్కొందంటే చూడటానికి మనుష్యులు గుంపు చేరిపోతారు.

అలాంటి రాముడు ఇంటిదగ్గర ఎంతో సౌమ్యంగా వుంటుంది. పిల్లలు దానితో ఎంతో ఇష్టంతో. సరదాగా ఆడుకొంటారు. ఆ ఇంటిల్లిపాదీ అదంటే పడిచస్తారు. దాన్ని తమ ఆత్మీయుడుగా తీసుకున్నారు. అది వారిని అమితంగా గౌరవిస్తున్నదని దాని నైఖరి స్పష్టంగా తెలియజేస్తోంది.

క్రమ క్రమంగా రాముడు వూళ్ళో మంచి పేరు తెచ్చుకొంది. అది వూరంతటికీ ఇష్టమైన దయింది. అది పొలాలనుంచి సాయంకాలం ఇంటికి వస్తున్నా, ఇంటినుంచి పొలాలకు వెళ్తున్నా, ఆడా మగా అదేపనిగా చూస్తూ వుంటారు. చాలమంది పిలిచి దానికి తినడానికి ఏమైనా పెట్టూవుంటారు. ఆ వూళ్లో రాముడంటే మనిషిని ఎవరూ అనుకోరు. రాముడనగానే వారికి నరసయ్యగారి పొట్టేలని అర్థం.

సీను రాముణ్ణిచూసి చాల గర్వ పడుతుంటాడు. పిల్లలు దానిమీాద సవారి తీస్తుంటారు. కాని ఇతర పిల్లలు రాముణ్ణి చూడగానే పారిపోతారు. అది అంత పెద్దదై కొమ్ములుతిరిగి అద్భుతంగా తయారైంది.

ఇలాంటి పొట్టేలుమీద ఎవరికైనా కన్ను పడటం సహజమే.

చాలమంది రాముణ్ణి కొనడానికి వచ్చారు. ఎంత డబ్బయినా ఇవ్వడానికి సిద్ధపడ్డారు. నరసయ్యమాత్రం దీన్ని అమ్మివేయడమే మంచి దనుకొన్నాడు. కానీ సీను మాత్రం దాన్ని అమ్మివేయడానికి ఇష్టపడలేదు. రాముణ్ణి వదిలి తాను వుండలేననుకున్నాడు. ఏమయినాసరే, దాన్ని తనకు దూరం చేసుకోరాదని నిర్ణయించుకొన్నాడు. అందుకు ఎంత కష్ట పడటానికయినా సిద్ధపడ్డాడు.

ఒకసారి నరసయ్యకు డబ్బు అవసరం కలిగింది. ఎక్కడా డబ్బు దొరకలేదు. ఎవరిదగ్గరైనా అప్పు చేయడం నరసయ్యకు ఇష్టంలేదు. మునసబు, కరణం పొట్టేలు కావాలని అడిగారు. ఇవ్వడానికి వీల్లేదని, ముఖ్యంగా సీను ఒప్పుకోడని ఇదివరకే చెప్పేశాడు. అందుకని మునసబు. కరణం కూడా నరసయ్యమీద కోపంగా వుంటున్నారు. శిస్తు అర్జెంటుగా చెల్లించాలని రోజుకు అర్థడజనుసార్లు తలార్లను పంపుతున్నాడు. పైగా సీనుకు స్కూల్లో జీతం కట్టాలి. పెద్ద కూతురుకు కొత్తచీర పెట్టి అత్తవారింటికి పంపించాలి. అన్ని ఒక్కసారే వచ్చాయి. పొట్టేలును అమ్మక తప్పేటట్టు లేదు. ముందు శీనుకు చెప్పడం మంచిదనుకొన్నాడు.

"సీనూ పొట్టేలును అమ్మితే తప్ప వీలయ్యేటట్లు లేదు. ఎక్కడా దమ్మిడీ దొరక్కుండా వుంది. లక్ష్మన్న కూడా వూళ్లో లేడు," అన్నాడు సీనును పిలిచి.

సీను కదలిపోయాడు. అమితంగా కోపం వచ్చింది. ఉద్రేకంతో కంపించిపోయాడు. నిమిషంలో దుఃఖం ముంచుకొచ్చేసింది. తన రాముడు ముక్కలు ముక్కలుగా నరకబడుతున్న దృశ్యం కళ్ళముందు కనిపించింది. తనను ఎవరో రాక్షసుడు నలిపి పాలేస్తున్నంత బాధతో కష్టంతో రెండు నిమిషాలలో నీరసించిపోయాడు.

"నాకు చదువూ వద్దు. ఏమీ వద్దు రాముడుంటే చాలు" అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

నరసయ్య సీనుకు అంత కష్టం కలుగుతుందకోలేదు. ఇక మిగతా పిల్లలకు తెలిస్తే, వాళ్ళందరుకూడా కష్టపడతారు. అందరూ కలిసి 'అమ్మ వద్ద'ని బ్రతిమాలుతారు. నానా గోల చేస్తారు. పెద్ద కూతురికి తెలిస్తే, తనకోసం అంత మంచి రాముణ్ణి కసాయివాళ్ళకు అమ్మి వేయడానికి ఇష్టపడదు. ఎందుకొచ్చిన గొడవ. ఇంకోదారి చూద్దాం" అనుకొన్నాడు.

చివరకు భార్య నగలు తాకట్టుపెట్టి, డబ్బు తెచ్చి అన్నీ సర్దుబాటు చేసుకొన్నాడు.

వారం రోజులు గడిచాయి. ఆ రోజు ఎవరో పరాయి వాళ్ళు, జీవాల వ్యాపారం చేసేవాళ్ళు ఆ వూరు వచ్చారు. వాళ్ళు నరసయ్య ఇంట్లోవున్న మంచి ఒకటో రకం పొట్టేలును గురించి విని, ఎలా అయినాసరే, దాన్ని కొని తీరాలనుకొన్నారు. దాన్ని గొర్రెలమీదికి వదలడానికి, మందలున్నవాళ్ళు ఎంత డబ్బయినాసరే ఇచ్చి కొనుక్కొనే అవ

కాశముంది. ఇటుప్రక్క గొర్రెల మందలు తక్కువ కాబట్టి కాలుపట్టని పొట్టేళ్ళ విలువ వీళ్ళకు తెలియదు. తమ ప్రాంతాల్లో వీటికి మంచి విలువ వుంటుంది. అంచేత కొని తీసాలనుకొన్నారు.

ఆ సాయంకాలం నరసయ్య పొలంనుంచి వచ్చేసరికి ఇంటిముందు ఎర్రని తలపాగాలు చుట్టుకొని ఇద్దరు మనుష్యులు కనిపించారు నరసయ్యకు.

“మాది తంజావూరు. జీవాలకోసం వొచ్చినాము. మీది పొట్టేలు వొకటి వుందని వింటిమి” అన్నాడు. అందులో ఒకడు.

“వున్నమాట నిజమే. కాని మాకు దానిని ఇచ్చే ఉద్దేశం లేదు. లోపలికి రండి. ఇక్కడే భోజనం చేసుకొని పోదురు” అన్నాడు నరసయ్య.

“తాము అట్లా అంటే బాగలేదు. మేము దుడ్డు తక్కువ ఇస్తామని మీరు అట్లా అని వుంటారు. మీరి మంచి జీవం. దీనికి నలభై రూపాయలు ఇస్తాము. ఇంతకన్న ఎక్కువ ఎవరు ఇస్తారు? తాము యోచించి చెప్పండి” అన్నాడతను.

“నాకు ఇచ్చే ఆలోచన లేదని చెప్పినప్పుడు మీరు అడగటం బాగులేదు. దయచేసి వెళ్ళండి” అని లోపలికి వెళ్ళాడు నరసయ్య.

“అయితే ఇవ్వారన్నమాట” అన్నాడు వారిలో మరొకతను.

“వీల్లేదు” అన్నాడు లోపలినుంచే నరసయ్య.

ఇలా వాళ్ళు రాముణ్ణి అడిగినట్లు ఇంట్లో ఎవరికీ చెప్పలేదు నరసయ్య. భార్య ఇచ్చేయమంటుందని నరసయ్యకు తెలుసు. సీనుకు తెలిస్తే భోజనం మానేసి నానా అల్లరి చేస్తాడు. చిన్న పిల్లలు దిగులు పడిపోతారు.

రాత్రి భోజనంచేసి, ఆరుబయట చల్లని గాలిలో పచార్లు చేస్తూవుంటే, వాళ్ళు మళ్ళీ వచ్చి అడిగారు. ఈసారి కఠినంగా ఇవ్వనని చెప్పేసరికి వెళ్ళిపోయారు.

♦ ♦ ♦

ఉదయం లేవగానే సీనుచేసే మొదటి పని రాముడు దగ్గరకు వెళ్ళటం. ఆ రోజు ఉదయం కూడా అలాగే వెళ్లాడు. మామూలుగా కట్టివుంచిన చోటుతో రాముడు కనిపించ లేదు.

"రాముడూ" అని బిగ్గరగా పిలిచాడు. కనిపించలేదు. దొడ్డీ, ఇల్లూ వెదికాడు. ఎక్కడా కనిపించలేదు. గాభరాపడి తండ్రిని లేపి చెప్పాడు. ఆయనా గాభరాపడి వచ్చి చూశాడు. రాత్రి తెంపుకొని వెళ్ళిపోయిందేమోనని, చుట్టుప్రక్కల ఇళ్ళూ, వాకిళ్ళూ వెదికారు.

ఆ రోజంతా సీను, నరసయ్య, పనివాళ్ళు వూరూ, పొలాలూ వెదికారు. ఎక్కడా రాముడి జాడ కనిపించక పోయేసరికి అందరూ దిగులు పడిపోయారు. సీను ఉదయం నుంచి మంచినీళ్ళు ముట్టుకోలేదు. అదే పిచ్చిగా తిరుగు తున్నాడు.

రెండుమూడు రోజులు గడిచాయి. రాముడి చిరునామా లభించలేదు. నరసయ్యకు అంత పెద్దవాడే రాముణ్ణి తలచుకొని బాధ పడుతున్నాడు. ఆయన భార్య "ఎవరో రాత్రి వచ్చి పట్టుకుపోయారని" వాళ్ళను శపిస్తూ అదేపనిగా తిడ్తోంది. పిల్లలు వస్తుందనే ఆశతో మాటి మాటికీ ద్వారం కేసి చూస్తున్నారు. రాముణ్ణి గురించే మాట్లాడుకొంటున్నారు.

సీను ఎంత బలవంతం చేసినా భోజనం చేయలేదు. రాత్రిళ్ళు నిద్రపోవడంలేదు. పగలంతా తిరుగుతోనే వున్నాడు "రాముడూ...రాముడూ" అని పిలుస్తున్నాడు. రాత్రి కలత నిద్రతో పలవరిస్తున్నాడు. దిగులుతో చిక్కిపోయాడు. అప్పుడప్పుడు తలుచుకొని తలచుకొని, దుఃఖంతో కృంగిపోతున్నాడు.

ఆ రాత్రి అమ్మకానికి అడిగినవాళ్ళు దొంగతనంగా పట్టుకుపోయి వుంటారని నరసయ్య నిర్ణయించుకొన్నాడు. వాళ్ళకోసం వెదకడం వృథా అని వూరుకొన్నాడు.

మరో మూడు రోజులలో సీను అలసిపోయి పడుకొన్నాడు. పడుకొని మరో కొన్నాళ్లు లేవలేదు. "రాముడు రాము"డని కేకలు వేస్తున్నాడు. ఎవ రెంత చెప్పినా వినిపించుకోలేదు. అలాంటి మరొకదాన్ని తెప్పించి యిస్తామన్నా ఒప్పుకోలేదు. రాముడు అతని ప్రియమైన స్నేహితుడు. వాళ్ళిద్దరి మధ్య ఒక రకం ఆత్మీయత ఏర్పడింది. ఆ ఆత్మీయతను మరో భౌతికమైన జీవంద్వారా అతను పొందలేదు.

సీనుకు జ్వరం వచ్చింది. మతి కూడా చలించింద దన్నారు వైద్యులు. అయితే గట్టి ప్రయత్నంచేత నరసయ్య సీనును బ్రతికించుకొన్నాడు. అతని కొక మంచి పొట్టేలు పిల్లను కొనిపెట్టాడు.

జబ్బునుంచి లేచిం తర్వాత సీను చేసిన మొట్టమొదటి పని ఏమిటి అంటే, ఆ కొత్త పొట్టేలు పిల్లను కోపంతో ఒక్క తన్ను తన్నాడు. అది అరిచేసరికి, రాముడు జ్ఞాపకం వచ్చి బాధపడ్డాడు. ఆ పిల్లను తాడువిప్పి తరిమేశాడు. మళ్ళీ "ప్రీటి జోలికి పోరా" దనుకొని తన పుస్తకాలు సర్దుకొన్నాడు.

—:•••:—